

3న సికిల్‌సెల్ వైద్య పరీక్షలు

సీతంపేటరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పీఎం జన్మన్ కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు డిసెంబరు 3న సీతంపేట వైటీసీలో సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20 గిరిజన మండలాల్లోని 0-40 ఏళ్ల మధ్య ఉన్న గిరిజన ప్రజలు, విద్యార్థులకు ఈ పరీక్షలు చేయనున్నట్టు చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి మధ్య చేసిన సికిల్‌సెల్ అనీమియా పరీక్షల్లో 195 మందికి పాజిటివ్ వచ్చినట్టు తెలిపారు. వీరికి మరోసారి పరీక్షలు చేసి కేజీహెచ్ ఆసుపత్రి ద్వారా సర్టిఫికెట్ అందిస్తామని అన్నారు.

'తోటపల్లి'లో గుర్రపు డెక్క



తోటపల్లి ప్రాజెక్టులో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో మైదానాన్ని తలపిస్తున్న దృశ్యం

- బోటు షికారుకు అవరోధంగా మారిన వైనం
- నిరాశలో పర్యాటకులు
- చేపలకు సంక్రమిస్తున్న వ్యాధులు
- పర్యాటక అభివృద్ధిపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



ఒక బోటుకే పరిమితమైన షికారు

గరుగుబిల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు తోటపల్లిని గుర్రపు డెక్క ఆవహించింది. ప్రాజెక్టులో కనుచూపు మేర గుర్రపు డెక్క పేరుకుపోవడంతో బోటు షికారుకు అవరోధంగా మారింది. దీంతో పర్యాటకులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. మరోచోట బోటు షికారు ఏర్పాటు చేసినా పర్యాటకులు అక్కడకు పెద్దగా వెళ్లడం లేదు. మరోపక్క గుర్రపు డెక్క, పిట్ట తామర కారణంగా చేపలకు పలు వ్యాధులు సంక్రమిస్తున్నాయి. ఈ ప్రాజెక్టును గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వంలో ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని జిల్లావాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని గిరిజనులకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో 2012లో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది. దీనికోసం రూ.41.92 లక్షల నిధులను మంజూరు చేసింది. నిర్వాసితుల టూరిజం కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను కూడా ఏర్పాటు చేసింది. ముఖ్యంగా పర్యాటకులను ఆకర్షించేందుకు బోటు షికారును ఏర్పాటు చేశారు. ప్రారంభంలో స్పీడ్ బోటు, రెడ్‌లాబ్ స్టార్ బోటు, వాటర్ టాక్సీ పెడల్ బోటు, కయల్ బోట్లుతో పాటు మరోక బోటును కొనుగోలు చేసి నడపారు. ప్రతిరోజూ దాదాపు 500 మంది పర్యాటకులు బోట్లలో తోటపల్లిలో విహరించేవారు. దీనివల్ల గిరిజనులకు ఉపాధి దొరికేది. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కూడా ప్రాజెక్టు అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంది. పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో అవసరమైన సౌకర్యాలు కల్పించింది. మత్స్య సంపదను పెంచుకుని జీవనం సాగించేందుకు ప్రణాళికలను రూపొందించింది. తదుపరి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేసింది. దీంతో ప్రాజెక్టులో అధికంగా గుర్రపు డెక్క పేరుకుపోయింది. దీని తొలగింపునకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గుర్రపు డెక్క అడ్డుగా ఉండటంతో బోట్లు తిరగలేని పరిస్థితి ఏర్పడింది. ఐదు బోట్లకుగాను మూడు బోట్లు గుర్రపు డెక్క వలలో చిక్కుకున్నాయి. ప్రస్తుతం రెండు బోట్లు మాత్రమే తిరుగుతున్నాయి. అయితే, ప్రాజెక్టుకు కిలోమీటరు దూరంలో గుర్రపు డెక్క లేని ప్రాంతంలో ప్రస్తుతం బోటు షికారును ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతం దూరం కావడంతో అక్కడకు వెళ్లేందుకు పర్యాటకులు ఇష్టపడడం లేదు. ఫలితంగా పర్యాటకుల సంఖ్య తగ్గు ముఖం పట్టింది. ప్రస్తుతం 50 మంది కూడా ఇక్కడకు రావడం లేదు. గుర్రపు డెక్కకు తోడు పిట్ట తామర కారణంగా చేపలకు పలు వ్యాధులు సంక్రమించి చనిపోతున్నాయి. దీంతో మత్స్యకారులు ఇక్కడ చేపలను వేటాడడం లేదు. ఉపాధి దూరం కావడంతో పలువురు మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు.



అంతంత మాత్రంగానే వచ్చిన పర్యాటకులు

నిరుపయోగంగా టూరిజం బోట్లు

ప్రాజెక్టులో బోటు షికారు కోసం గతంలో పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన రెండు బోట్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. సుమారు రూ.22 లక్షలు వెచ్చించి వీటిని కొనుగోలు చేసినా ఎటువంటి ఫలితం కానరావడం లేదు. గుర్రపు డెక్క నడుమ బోట్లు చిక్కుకున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు ప్రాంతంలో బోటు షికారును ఓ ప్రైవేటు సంస్థ నిర్వహిస్తోంది. ముగ్గురు డ్రైవర్లు, ఒక సహాయకుడు, నైట్ వాచ్‌మన్, సూపర్‌వైజర్ విధులు నిర్వహిస్తున్నారు. నెలకు లక్ష రూపాయలకు పైగా ఖర్చులు అవుతున్నాయి. పర్యాటకుల సంఖ్య తగ్గడంతో ఆ సంస్థ బోటు షికారుకు స్వస్తి పలికేందుకు సిద్ధమవుతోంది. ఇదే జరిగితే గుర్రపు డెక్కల నడుమ చిక్కుకున్న పర్యాటక సంస్థ బోట్లను వెలికితీసి తమకు అప్పగించాలని గిరిజన కుటుంబాలు కోరుతున్నాయి. బోటు షికారు నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నామని, దీనివల్ల తమ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు. అలాగే, ప్రాజెక్టు ప్రాంతంలో పూర్తిస్థాయిలో గుర్రపు డెక్క తొలగించి సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గుర్రపు డెక్క తొలగించాలి



తోటపల్లి ప్రాజెక్టులో అధికంగా గుర్రపు డెక్క పేరుకుపోయింది. దీనివల్ల బోట్లు తిప్పలేకపోతున్నాం. గతంలో అధికంగా పర్యాటకులు వచ్చేవారు. ప్రస్తుతం కార్తీకమాసంతో పాటు సెలవు దినాల్లో అంతం త మాత్రంగానే వస్తున్నారు. ప్రస్తుతం మా ఉపాధి కోసం వాటర్ టాక్స్, స్పీడ్ బోట్లను ఉపయోగిస్తున్నాం. గుర్రపు డెక్కను తొగించాలని పలు దఫాలు అధికారులను కోరినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా తొలగించాలి.

- ఎస్.రాజేష్ హెల్పర్, ఎ.సురేష్ బోటు డ్రైవర్, పిన్నింటిరామినాయుడువలస

నష్టాలకు గురవుతున్నాం

తోటపల్లి ప్రాజెక్టుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుతం ప్రాజెక్టులో గుర్రపు డెక్క, పిట్ట తామర పేరుకుపోయింది. దీనివల్ల చేపలు పట్టుకునే అవకాశం లేదు. చేపలకు పలు వ్యాధులు సంక్రమిస్తున్నాయి. గుర్రపు డెక్క తొలగింపునకు అవకాశం ఉన్నా అధికారులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం వేరే ప్రాంతానికి వెళ్లి మత్స్యకారులు చేపల వేట చేసుకుంటున్నారు. గుర్రపు డెక్క సమస్యను గిరిజనశాఖ మంత్రితో పాటు కురుపాం ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకువెళ్లాం.

-ఈదల తిరుపతిరావు, గిరిజన నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు, కోటవానివలస

మరింత రుచిగా మధ్యాహ్న భోజనం

- నిధులు పెంచిన కేంద్ర ప్రభుత్వం



సాలూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచింది. దీంతో విద్యార్థులకు మరింత రుచికరమైన భోజనం అందనుంది. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కొక్క విద్యార్థి మధ్యాహ్న భోజనం కోసం రూ.5.45 ఇస్తుంది. దానికి రాష్ట్ర ప్రభుత్వం మరో 43 పైసలు కలిపి రూ. 5.88 చెల్లిస్తున్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒక్కొక్క విద్యార్థికి కేంద్రం రూ. 8.17, రాష్ట్ర ప్రభుత్వం 40 పైసలు కలిపి రూ. 8.57 అందిస్తున్నారు. తాజాగా, కేంద్రం ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ. 5.45 నుంచి రూ.6.19, ప్రాథమికోన్నత, ఉన్నత విద్యార్థులకు రూ. 8.17 నుంచి రూ. 9.26కు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. వీటికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే మొత్తం కలవనుంది. కాగా, జిల్లాలో 1,490 పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 98వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచడంతో మరింత రుచికరంగా, నాణ్యతతో విద్యార్థులకు భోజనం అందనుంది. ఇప్పటికే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరిట కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో రుచికరమైన పౌష్టికాహారం అందిస్తుంది. రేట్లు పెరగడంతో ఈ పథకాన్ని సమీక్షించి మరింత శ్రేష్టంగా భోజనం ప్రభుత్వం అందించనుంది.

ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్

- పార్వతీపురం సంతలో సమస్యల తిష్ఠ
- క్రయవిక్రయదారుల ఇబ్బందులు



సంత ఆవరణలో నిలిచిన మురుగు నీరు

పార్వతీపురంటౌన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలోనే పార్వతీపురం సంత పెద్దది. ప్రతి గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీలో జరిగే ఈ సంత ద్వారా ఏఎంసీకి భారీ ఆదాయం వస్తుంది. కానీ, సౌకర్యాలు మాత్రం ఆ స్థాయిలో లేవు. దీంతో క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సంతలో పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల వ్యాపారం ఎక్కువగా జరుగుతుంటుంది. సుదూర ప్రాంతాల నుంచి కొనుగోలు, అమ్మకందారులు వస్తుంటారు. ఆశీల రూపంలో ఏడాదికి కనీసం రూ.20 లక్షల ఆదాయం వస్తుంది. ఇంత ఆదాయం వస్తున్నా సంతలో సమస్యలు తిష్ఠ వేశాయి. కనీస సౌకర్యాలు కానరావడం లేదు. ఎక్కడ పడితే అక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో క్రయవిక్రయదారులు ఇబ్బంది పడుతున్నారు. అంతే కాకుండా పశువులకు దాహం తీర్చే నీటి తొట్టెలు శిథిలావస్థకు చేరాయి. క్రయవిక్రయదారులు తాగేందుకు నీటి సదుపాయం కూడా లేదు. దాహార్తిని తీర్చుకోవాలంటే చుట్టు పక్కల వారిని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వంలోనైనా సంతలో సమస్యలు పరిష్కారం అవుతాయని, కొనుగోలు, అమ్మకందారులు ఆశిస్తున్నారు. ఈ విషయమై ఏఎంసీ అధికారులను వివరణ కోరగా అందుబాటులో లేరు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం/టౌన్/రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో పూలే వర్ధంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ గర్వించదగ్గ గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని కొనియాడారు. బడుగు, బలహీన, అణగారిన వర్గాల కోసం.. మహిళల విద్య, అభ్యున్నతి కోసం కృషిచేసిన మహనుభావుడని అన్నారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు, స్త్రీజనోద్ధరణ కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడని అన్నారు. పూలే స్ఫూర్తితో మనమంతా సమసమాజ స్థాపనంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎస్.కృష్ణ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత

ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పార్వతీపురం పట్టణంలోని ఏఎంసీ ఆవరణలో ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను ఆయన గురువారం పరిశీలించారు. అక్కడ భద్రత పరిస్థితిని గమనించారు. గోదాముల సీల్‌లు, తాళాలు, వెలుపల ఉన్న సీసీ కెమెరాల పనితీరును గమనించారు. భద్రత సిబ్బందికి, అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బెలగాం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపకరణాల కోసం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిబిరాలను విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కోరారు. గురువారం స్థానిక జీజే కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. పరికరాల కోసం ఎంపికైన దివ్యాంగులకు పత్రాలు పంపిణీ చేశారు. రెండు లేదా మూడు నెలల్లో పరికరాలు వస్తాయని, వాటిని అప్పుడు పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన హైదరాబాద్ అధారిత అలిమ్ కో (ఆర్టిఫిషయల్ లింబ్ మ్యాను ఫ్యాక్చరింగ్ కంపెనీ) సహకారంతో ఇప్పటికే సాలూరు, పాలకొండ, పార్వతీపురంలో శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం కురుపాంలో శిబిరం ఏర్పాటు చేస్తామని అన్నారు. అవసరమైన వారికి బ్యాటరీ ట్రై సైకిల్, సాధారణ ట్రై సైకిల్, వీల్ చైర్, చంక కర్రలు, వినికిడి పరికరాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత, డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి రమేష్ రామన్, అలిమ్ కో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇవా గోనె సంచులు?

- చిరిగినవి అంటగడుతున్న మిల్లర్లు
- రైతులకు తప్పని ఇబ్బందులు

6లో



యువత రాజకీయాల్లోకి రావాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

6లో



గుండెపోటుతో హెచ్‌ఎం మృతి

- లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమంలో కలకలం
- ఉదయం స్నానం చేసి దుస్తులు ఆరబెడుతూ కుప్పకూలిన వైనం



6లో

ఆయన ఇంట్లో 18 బైకులు



బుల్లెట్ డ్రైవ్ చేస్తున్న డేవిడ్ ప్రసన్నకుమార్

- రోజుకో వాహనంపై కార్యాలయానికి హాజరు
- మెంటాడ హౌసింగ్ ఏఈ డేవిడ్ అభిరుచులు

సోమవారం స్కూటర్... మంగళవారం రాజ్‌దూత్... బుధవారం బుల్లెట్... గురువారం జావా... శుక్రవారం యెజ్డి... శనివారం యమహా... దేవుళ్ల పేర్లులాగా ఈ వారాల పేర్ల పక్కన మోటార్ సైకిళ్ల పేర్లేంటి అనుకుంటున్నారా? ఈ పేర్లకు ఓ ప్రత్యేకత ఉంది. అందుకే అలా చెప్పుకుంటున్నాం. అంతేనా.. ఈ బైకులకు.. ఓ ఇంజినీరింగ్ అధికారికీ ప్రత్యేక బంధం ఉంది. ఆ బంధమేంటో తెలియాలంటే మెంటాడ హౌసింగ్ ఏఈ డేవిడ్ ప్రసన్న కుమార్‌ను కలుసుకోవాలి.

మెంటాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మెంటాడ హౌసింగ్ ఏఈ కొల్లు డేవిడ్ ప్రసన్నకుమార్‌కు మోటారు సైకిళ్ల మార్చడమంటే అమిత ఇష్టం. ఎంతలా అంటే ఆయన ఇంట్లో ఒకటి.. రెండు కాదు ఏకంగా 18 మోటారు బైకులున్నాయి. అన్నీ మంచి కండిషన్లోనే ఉన్నాయండోయ్. 1947 నుంచి 2023 మోడల్ వరకు వున్న 18 బైకుల్లో రోజుకోదానిపై కార్యాలయానికి వెళ్లి వస్తుంటారు. 1947 మోడల్ ఎన్ఫీల్డ్, 1980 యెజ్డి, రాజ్ దూత్ క్లాసిక్, జావా, రేంజర్, రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇలా వివిధ మోడల్ బైకులున్నాయి. వీటికోసం ఆయన విజయనగరం పుల్‌బాగ్‌లోని సొంతింటిలో కొంత భాగాన్ని గ్యారేజ్‌గా మార్చి, వాటిలో ఏదైనా రిపేరుకు గురైతే తానే మోకానిక్ అవతారమెత్తుతారు. ఆయా బైకుల విడిభాగాలు జిల్లాలో దొరకవు. దీంతో వాటిని హైదరాబాదు నుంచి తెప్పిస్తుంటారు. ఒక్కోపార్టు రెండేసి చొప్పున తెప్పించి ఎప్పుడూ రెడీగా ఉంచుకుంటారు.


పాత మోడల్ బైకు కనిపిస్తే చాలు దాన్ని కొనేసి ఉపయోగించే వరకు నిద్రపోరు. 10వ తరగతి చదువుతున్న సమయంలో ఎక్కువ బైకులు వాడాలని అనుకుండేవాడినని, 1985లో ఉద్యోగంలో చేరాక తన కలను నిజం చేసుకోవడం ప్రారంభించానని ప్రసన్న కుమార్ చెబుతున్నారు. త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన ఇప్పటివరకు తాను పని చేసిన అన్ని ప్రాంతాలకు ఎంత దూరమైనా బైకులపైనే వెళ్లి వస్తున్నానని తెలిపారు.

పొటోగ్రఫీలో ప్రతిభ..


డేవిడ్ ప్రసన్నకుమార్ ఫొటోగ్రఫీ అన్నా వల్లమాలిన ప్రేమ. అద్భుతమైన ప్రకృతి అందాలను కెమెరాలో బంధించి ఎంతోమంది ప్రముఖుల అభినందనలు అందుకొన్నారు. ప్రతిష్ఠాత్మకమైన అవార్డులను కూడా సొంతం చేసుకున్నారు.













ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం
- పోలీసు ఉద్యోగులు రోల్ మోడల్‌గా ఉండాలి: డీఐజీ



పరుగుపందెం ప్రారంభిస్తున్న డీఐజీ గోపీనాథ్‌జెట్టి



విజేతలకు బహుమతుల ప్రదానం

విజయనగరం క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగులు అన్ని రంగాల్లోనూ ఇతరులకు రోల్ మోడల్‌గా వుండాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గురువారం వార్షిక జిల్లా పోలీసు స్పోర్ట్స్ మీట్ జరిగింది. కార్యక్రమానికి డీఐజీ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి, సబ్ డివిజన్లతో పాటు ఏఆర్ విభాగానికి చెందిన నాలుగు జట్లు ఈ పోటీల్లో పాల్గొని క్రీడా ప్రతిభను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, శారీరక సామర్థ్యంతో పాటు మానసిక ఆనందం కూడా చాలా అవసరమని వాటిని మెరుగుపరుచుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పోలీసుల ఆరోగ్యం, మానసిక ఆనందాన్ని దృష్టిలో వుంచుకుని వార్షిక పోటీలను నిర్వహించామన్నారు. ప్రతి గెలుపు ఓటమి మధ్య చిన్న వ్యత్యాసం మాత్రమే ఉంటుందని, దానిని అధిగమించి విజయం సాధించేందుకు అవసరమైన స్ఫూర్తిని ఈ క్రీడలతో ఉద్యోగులు పొందాలని సమాజానికి మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ, ఉద్యోగులు అంతా ఒక్కటిగా పనిచేయడం విజయానికి అవసరమైన సహాయ, సహకారాలను ఒకరికొకరు అందించుకునే క్రీడా స్ఫూర్తి ఉద్యోగులకు అవసరమన్నారు. ప్రారంభ వేడుకల్లో ఏఎస్పీలు పి.సౌమ్యలత, జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు ఎం. శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, రాఘవులు, వీరకుమార్, యూనివర్స్‌తో పాటు సీఐలు, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



పరుగుపందెంలో పోలీసులు

సరదాగా కాసేపు!



విజయనగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు గురువారం సరదాగా విద్యుత్ వాహనాన్ని నడిపి ఆకట్టుకున్నారు. ఎటువంటి శబ్ద కాలుష్యం.. పొగ లేకుండా హాయిగా నడుస్తున్న ఎలక్ట్రికల్ స్కూటీపై చక్కర్లు కొట్టారు. కేవలం 3 యూనిట్ల విద్యుత్‌తో 100 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని సంబంధిత నిపుణులు తెలిపారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. ఇటువంటి సాంకేతిక నైపుణ్యం రాబోయే తరాలకు ఎంతో ఉపయోగపడతుందని అన్నారు. నగరాల్లో కాలుష్యాన్ని తగ్గించేందుకు విద్యుత్ వాహనాలు, బస్సులు ప్రవేశపెట్టడం ఆనందించదగ్గ విషయమని అన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

- నిజాయితీగా ఎదగాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విజయనగరం దాసన్నపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లంచగొండులు, అవినీతిపరులు, దుర్మార్గులు దేశాన్ని నాశనం చేస్తున్నారని యువత రాజకీయాల్లోకి వచ్చి నిజాయితీ కలిగిన నేతలుగా ఎదగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. విజయనగరంలో జరుగుతున్న 49వ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి చదువుతో పాటు సమాజంలో మంచి చెడ్డలు, రాజకీయాలు పూర్తిగా తెలియాల్సిన అవసరం వుందన్నారు. స్వాతంత్ర్యం రాక ముందు నుంచి ఏఐఎస్ఎఫ్ ఉద్యమాల్లో పాల్గొంటోందని గుర్తుచేశారు. నాడు పనిచేసిన అనేక మంది వివిధ స్థాయిల్లో పదవులు చేపట్టారని, వారిలో అటల్ బిహారీ వాజ్‌పేయి, ఐకే గుజ్రాల్ వున్నారన్నారు. నేడు అనర్హులైన వారు ప్రభుత్వ పాలన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించినా, వారి భవిష్యత్ తలరాతలను రాజకీయ నేతలు రాస్తున్నారని కాబట్టి ప్రతి విద్యార్థి సమర్థవంత రాజకీయ నాయకుడిగా ఎదగాలని, మంచి సమాజాన్ని నిర్మించేందుకు తమ వంతు బాధ్యతను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి దినేష్ రంగరాజు, జి.ఈశ్వరయ్యతో పాటు సీపీఐ నేతలు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి

- లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమంలో కలకలం
- ఉదయం స్నానం చేసి దుస్తులు ఆరబెడుతూ కుప్పకూలిన వైనం



నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు

గజపతినగరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శిక్షణ తరగతులకు వచ్చిన ఓ ప్రధానోపాధ్యాయుడు గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. గజపతినగరం మండలం మరుపల్లి గ్రామం బాలాజీ పాలిటెక్నికల్ కళాశాలలో ఈనెల 25నుంచి 30వ తేదీ వరకు ఆరు రోజుల పాటు లీడర్ షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ తరగతులకు మన్యం జిల్లా నుంచి వంద మంది, విజయనగరం జిల్లా నుంచి వంద మంది ప్రధానోపాధ్యాయులు వచ్చారు. మన్యం జిల్లా భామిని మండలం నేరేడు జిల్లా పరిషత్ హైస్కూలు హెచ్ఎం సిరిపరపు శ్రీనివాసరావు గురువారం తెల్లవారుజామున కళాశాల ఆవరణలో వాకింగ్ చేసిన తర్వాత కాలకృత్యాలు తీర్చుకుని తడి దుస్తులను ఆరుబయట వేస్తుండగా గుండెపోటుతో అక్కడికక్కడే కుప్పకూలి పోయారు. దీంతో ఉపాధ్యాయులు ఆయన్ను 108 వాహనంలో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయన మృతదేహన్ని కళాశాలకు తీసుకుని వచ్చారు. శిక్షణ తరగతులతో మానసిక ఒత్తిడి తీసుకువస్తున్నారని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే బైఠాయించి నిరసన తెలియజేశారు. విజయనగరం డీఈవో మాణిక్యంనాయుడు, మన్యం డీఈవో ఎస్.తిరుపతి నాయుడు, డిప్యూటీ డీఈవో కె.మోహనరావు కళాశాలకు వచ్చి ఉపాధ్యాయుడి మృతికి కారణాలను తెలుసుకున్నారు. శ్రీనివాసరావు మృతి పట్ల వారంతా రెండు నిమషాలు మౌనం పాటించి ప్రగాడ సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆదుకునే చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. అనంతరం శిక్షణ తరగతులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.





పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బైఠాయించిన ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ సంఘాల నేతల నిరసనలు..

శ్రీనివాసరావు మృతి పట్ల యూటీఎఫ్, పీఆర్‌టీయూ తదితర సంఘాల నేతలు, ఉపాధ్యాయులు నిరసన తెలియజేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు రమేష్ చంద్ర పట్నాయక్ ఆరోపించారు. విద్యాశాఖ వింత పోకడలకు ఉపాధ్యాయులు బలి అవుతున్నారన్నారు. శిక్షణ ముగించుకుని రాత్రి అక్కడే పడుకోవాలని చెప్పడం దురదృష్టకరమన్నారు. పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావాడ రాంబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు మృతి చెందడం బాధాకరమన్నారు. గతంలో రెండు కార్యక్రమాలు జరిగిన తర్వాత మూడోది వద్దని విద్యాశాఖ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు.

అస్వస్థతకు గురై మృతి..

ఎస్.శ్రీనివాసరావు అనారోగ్య కారణం వల్ల అస్వస్థతకు గురై మృతి చెందారని విశాఖపట్నం జోన్-1 ఆర్జేడీ బి.విజయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసరావు దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని, అయినా అధికారుల నుంచి మినహాయింపు కోరలేదని అన్నారు. శిక్షణా కార్యక్రమం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. వసతి కోరిన వారికి వైద్య సదుపాయంతో పాటు అంబెలెన్స్, వైద్యుల అందుబాటులో ఉంచామన్నారు. శిక్షణకు 176మంది హాజరుకాగా 60మంది మాత్రమే ఇక్కడి వసతి కోరారన్నారు.

- విశాఖపట్నం జోన్-1 ఆర్జేడీ బి.విజయభాస్కర్

ఇవా గోనె సంచులు?

- చిరిగినవి అంటగడుతున్న మిల్లర్లు.. పైన మంచివి పెట్టి ప్యాకింగ్
- రైతులకు తప్పని ఇబ్బందులు
- బయట కొనుగోలు చేసుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు



గొట్టివలస కొనుగోలు కేంద్రానికి వచ్చిన చిరిగిన గోనె సంచులు

గరుగుబిల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి కొందరు మిల్లర్లు చిరిగిన గోనె సంచులను రైతులకు అంటగడుతున్నారు. పైకి మంచి సంచులు ఉంచి లోపల చిరిగినవి పెట్టి ప్యాకింగ్ చేస్తున్నారు. వీటిని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు వాహనాలపై తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఈ సంచులను తీసుకెళ్తున్న రైతులు ఇంటి వద్ద వాటిని చూసి ఖంగుతింటున్నారు. చిరిగిన సంచులే అధికంగా ఉండడంతో ధాన్యం నింపేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు చిరిగిన సంచులను ఒకటిగా కలిపి అందులో ధాన్యం పడుతున్నారు. కొందరు రైతులు ఈ సంచులను తీసుకెళ్లేందుకు ఇష్టపడడం లేదు. బయట కొనుగోలు చేసేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం ఒక గోనె సంచికి రూ.3.39 మంజూరు చేస్తుంది. కానీ, అధికంగా చిరిగినవే ఉండడంతో బయట మార్కెట్‌లో రూ.10 చెల్లించి రైతులు సంచులు కొనుగోలు చేస్తున్నారు.

అధికారులు ఏం చేస్తున్నారు?

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు 183 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ధాన్యం తరలించేందుకు అధికారులు 93 మిల్లులను గుర్తించారు. 15 మండలాల్లోని రైతులకు అవసరమైన 21,97,230 గోనె సంచులను మిల్లర్లే అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే, మిల్లర్లు మాత్రం అధికంగా చిరిగిన గోనె సంచులనే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు వాహనాలపై తరలించారు. వాస్తవానికి ఈ సంచులను నిశితంగా పరిశీలించి తదుపరి కేంద్రాలకు పంపించే బాధ్యతను రెవెన్యూ సిబ్బందికి ప్రభుత్వం అప్పగించింది. సంచులు సక్రమంగా లేకుంటే సంబంధిత కస్టోడియన్ అధికారులపై చర్యలు చేపడతామని జాయింట్ కలెక్టర్ సైతం హెచ్చరించారు. అయినా, అధికారులు మిల్లర్లపై ప్రేమ చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. సంచులు బాగా లేవని రైతులు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు ఎందుకు మౌనం దాల్చుతున్నారో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలను జాప్యం చేస్తున్నారు. దీంతో అరకొరగానే కొనుగోలు జరుగుతున్నాయి.

మాకు సంబంధం లేదు..

మిల్లుల వద్ద గోనె సంచులను కస్టోడియన్ అధికారులు పరిశీలన చేసిన తరువాతే మేము వాహనాల్లో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నాం. చిరిగిన సంచులతో మాకు సంబంధం లేదు. మిల్లర్లు అధికంగా చిరిగిన సంచులనే కట్టలుగా వేస్తున్నారు.

-ఎ.తిరుపతినాయుడు, ట్రాన్స్‌ఫోర్ట్ కాంట్రాక్టర్

అన్నదాతలు దళారుల వలలో పడొద్దు: ఎమ్మెల్యే



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, నవంబరు 28: (ఆంధ్రజ్యోతి): దళారుల చేతిలో చిక్కి రైతులు మోసపోవద్దని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. విజయనగరం మండలం రాకోడు గ్రామంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ 2024-25నకు సంబంధించి ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారుఉ. సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,300 మద్దతు ధర ప్రకటించిందని వెల్లడించారు. ఉచిత గోనె సంచులు, కూలీ, రవాణా చార్జీల భారం ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లులకు అమ్ముకునే వెసులుబాటు కల్పించిందన్నారు. ధాన్యం ఇచ్చిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లో పడే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. జొన్నవలస, రాకోడు, కోరుకొండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని రైతులు దళారులు చేతిలో మోసపోకుండా, ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాకోడు సర్పంచ్ వేచలపు శ్రీను, టీడీపీ మండల నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, రాజేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో డబ్బులు అందాలి

గంట్యాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం ఇచ్చే రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. చెల్లింపులు ఆలస్యం చూసే బాధ్యత కస్టోడియన్, మిల్లర్లపై ఉందన్నారు. గురువారం సిరిపురం, రావివలస గ్రామాల్లో ఉన్న మిల్లులను జేసీ తనిఖీ చేశారు. మిల్లుల్లో ధాన్యం, రికార్డులను తనిఖీ చేశారు. ట్రక్ షీట్లపై ఆరా తీశారు. కస్టోడియన్, అధికారులు, వాహన పర్యవేక్షణ అధికారులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బంది పెట్టకుండా ధాన్యం తీసుకోవాలని ఆదేశించారు. ఆయనతో పాటు సివిల్ సప్లయిస్ డీఎం మీనాకుమారి, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, సీఎస్‌డీటీ మూర్తి తదితరులు ఉన్నారు.

మోసపోవద్దు

దత్తిరాజేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ మహరాజన్ సూచించారు. గురువారం ఆర్.రామచంద్రపురం, షికారుగంజి, చుక్కపేట, దత్తి తదితర గ్రామాల్లో క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను హెచ్చరికలు ఉన్నందున వరికోతలు చేయవద్దని, కోసిన వరిచేనును గాలి దుబ్బులు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనూరాధ, వీఏఏ ప్రశాంత్, రాము, రాజు రైతులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జూనియర్ సివిల్ జడ్జిగా నైమిష

చీపురుపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లికి చెందిన కెంబూరు నైమిష జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. భరత్ మోహన్, రుక్మిణల కుమార్తె అయిన నైమిష విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో బీఎల్ పూర్తి చేశారు. బుధవారం రాత్రి సివిల్ జడ్జి ఫలితాలు వెలువడ్డాయి.

రైస్ మిల్లు తనిఖీ

లక్కవరపుకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రంగారాయపురంలోని సోమ రాజులు రైస్ మిల్లును ఆర్డీవో కీర్తి బుధవారం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు మొదలవడంతో ఎక్కడా రైతులకు ఇబ్బంది కలగకుండా మిల్లర్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ ప్రసాదరావు, సీఎస్‌డీటీ జయలక్ష్మి ఉన్నారు.

మెప్మా పీడీగా చిట్టిరాజు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మెప్మా పీడీగా జీవీ చిట్టిరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

విజయనగరం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ప్రసాదరావు అన్నారు. బాల్య వివాహాల నిరోధంపై నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో ప్రసన్న పాల్గొన్నారు.

ఘనంగా తులసీ అర్చన

కొత్తవలస, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గరుడాద్రి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం లక్ష తులసీ అర్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర వెంకట అప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే చెప్పండి

కొత్తవలస, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే నేరుగా తనకు చెప్పాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు విద్యార్థులకు సూచించారు. గురువారం ఆయన కొత్తవలస జడ్పీ హైస్కూల్‌లో భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఆ తరువాత బలిఘట్టాం సచివాలయం రికార్డులను తనిఖీ చేశారు.

జగన్ పాలన అవినీతిమయం

గజపతినగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలన అంతా అవినీతిమయమే అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.ఎ.నాయుడు అన్నారు. గురువారం మండల పార్టీ అధ్యక్షుడు అట్టాడ లక్ష్మునాయుడు స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను తాకట్టు పెట్టి..అదానీ వద్ద రూ.1750 కోట్లు ముడుపులు తీసుకోవడం శోచనీయమన్నారు. జగన్ అవినీతి వల్ల ప్రతి కుటుంబంపై రూ.రెండు లక్షల వరకు అదనపు భారం పడుతోందన్నారు. యువ నాయకుడు లోకేష్ దృష్టిలో పెట్టి.. వైసీపీ నాయకుల ఇసుక, భూ దందాలను వెలికి తీస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొండపల్లి మాజీ జెడ్పీటీసీ బండారు బాలాజీ, ఆసుపత్రి మాజీ చైర్మన్ మిత్తిరెడ్డి వెంకటరమణ, కెంగువ మాజీ సర్పంచ్ మజ్జి రామునాయుడు గుప్తా, గోపి, సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

7న మెగా సమావేశాలు

బొండపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 7వ తేదీన ప్రభుత్వ స్కూళ్లలో మెగా తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించాలని ఆర్జేడీ బి.విజయబాస్కర్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులతో పాటు, దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని ఎంఈవోలను ఆదేశించా మన్నారు.

వ్యర్థాల తరలింపు

రాజాం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని కాపులపాడు వద్ద ఉన్న జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌నకు రాజాం పట్టణంలో సేకరించిన వ్యర్థాలను తరలిస్తున్నారు. సుమారు ఎనిమిది టన్నుల చెత్తను గురువారం తరలించారు. పురపాలక సంఘం కమిషనర్ జె.రామప్పలనాయుడు ఈ వాహనాన్ని ప్రారంభించారు.

సమస్యలు పరిష్కరించండి

వంగర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామసభల్లో భూ సమస్యలపై వచ్చిన వినతులు వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో సత్యవాణి ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం బంగారువలస, వంగర రైస్ మిల్లులను పరిశీలించారు.

నగర వనం అభివృద్ధి

విజయనగరం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలం కొండ వెలగాడ అటవీ ప్రాంతంలో చేపడుతున్న నగరవనం అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీని అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ. 2 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను జిల్లా అటవీ రేంజ్ అధికారి (ఎఫ్ఆర్‌వో) బి.అప్పలరాజు గురువారం పరిశీలించారు.

ఎమ్మెల్యే తీరుపై టీడీపీ నేతల ఆగ్రహం

గుషిణిలో నిలిచిన రోడ్డు పనులు



పనులను అడ్డుకుంటున్న టీడీపీ మద్దతుదారులు

నెల్లిమర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఉపాధి నిధుల విషయంలో పొత్తు ధర్మం పాటించలేదంటూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు బహిరంగంగానే విమర్శలకు దిగుతున్నారు. గుషిణిలో జనసేన నాయకుడు దురగాసి శేఖర్ తలపెట్టిన రోడ్డు పనులను గురువారం కూడా స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డుకున్నారు. శేఖర్‌కు సుమారు రూ.20 లక్షల విలువైన రోడ్ల పనులను ఎమ్మెల్యే అప్పగించారు. వీటిని మూడు రోజులుగా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు. గురువారం పనులు చేపట్టేందుకు వచ్చిన ఎస్కవేటర్‌ను కదలనివ్వలేదు. ఎన్నికల్లో తీవ్రంగా కష్టపడి.. నాగమాధవి విజయానికి బాసటగా నిలిచిన తమకు పనులు ఇవ్వకుండా కేవలం జనసేన నాయకులకు మాత్రమే ఇవ్వడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చందక నారాయణరావు, జమ్ము సురేష్, చందక సూర్యారావు, కోరాడ తవిటినాయుడు, చందక భుజంగరావు తదితరులు మాట్లాడుతూ తమకు కూడా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంత వరకు గ్రామంలో ఎలాంటి పనిని జరగనివ్వబోమని స్పష్టం చేశారు. నిధుల పంపిణీలో తమను ఎందుకు విస్మరించారో తేల్చాలని వారు ప్రశ్నించారు. యంత్రాన్ని అడ్డుకోవడంతో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

చీపురుపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. గరివిడి మండలం దువ్వాం గ్రామానికి చెందిన కింతాడ రేవంత్ కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.56 లక్షలు, మెరకముడిదాం మండలం చినరవ్వాం గ్రామానికి చెందిన జ్ఞానేశ్వరికి 2.52 లక్షల చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట్ల మోతీలాల్ నాయుడు, పైల బలరాం, సారేపాక సురేష్, అడపా సూర్యానారాయణ పాల్గొన్నారు.

లీగల్ సెల్ ఏర్పాటు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు, జిల్లా కోర్టులలో నమోదైన కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి అవసరమయ్యే కౌంటర్లను వేయడానికి జిల్లా స్థాయిలో లీగల్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ పి.మురళీ కృష్ణను నోడల్ అధికారిగా నియమించామని చెప్పారు. సహాయకులుగా డిప్యూటీ తహసీల్దారులు ఎం.ఉమా, సీహెచ్ రాజేశ్వరి, జూనియర్ అసిస్టెంట్ ఎ.శివ సాయి కిరణ్‌లను, లైజన్ అధికారిగా టి.రామకృష్ణ నియమించామన్నారు.

హక్కులను పరిరక్షించండి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఏపీ విభిన్న ప్రతిభావంతుల హక్కుల చట్టం -2016 అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం గురువారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. దీనికి ముందు ఎన్‌జీవో ప్రతినిధి, రెడ్ క్రాస్ చైర్మన్ కెఆర్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో విభిన్న ప్రతిభావంతుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెల్ కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్, జెడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆక్రమణలపై విచారణ

రేగిడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంకిలి పంచాయితీలో ఉన్న బౌట్, నాయుడు చెరువుల ఆక్రమణలపై గురువారం ఆర్ఐ రేవతి, సర్వేయర్ అప్పలనాయుడులు విచారణ చేపట్టారు. ఈఐడీ ప్యారీ కర్మాగారం, అనుబంధ డిస్టలరీ ప్లాంట్‌లు చెరువుల ఆక్రమణకు పాల్పడ్డాయని సర్పంచ్ పట్టాభి, మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహశీల్దారు చిన్నారావు విచారణకు ఆదేశించారు. ఈమేరకు విచారణ చేపట్టారు.

ఉపాధ్యాయుడి మృతి బాధాకరం



ఎస్.కోట: నిరసనలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గరివిడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం బాలాజీ పాలిటెక్నికల్‌లో జరిగిన శిక్షణలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు గుండె పోటుతో మృతి చెందడం బాధా కరమని గరివిడి మండల యూటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎంఈవో కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ ప్రతినిదిలు డి.రాము, ఎ.సత్యశ్రీనివాస్, జి.పద్మావతి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):మరుపల్లిలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మృతికి గురువారం రాత్రి జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాలు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ మృతి చెందిన ఉపాధ్యాయుడికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాధాకరం

నెల్లిమర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం మండలంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మృతి చెందడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.భాస్కరరావు, వి.రమణ గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. శిక్షణా కార్యక్రమాన్ని రద్దు చేయాలని.. బాధిత ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

శిక్షించాలి

వంగర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గజపతినగరంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుపై పని ఒత్తిడి పెంచి ప్రాణాలు పోవటానికి కారుకులైన వారిని శిక్షించాలని మండల యూటీఎఫ్ నాయకులు శ్రీనువాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురిచేసే శిక్షణ వద్దు

శృంగవరపుకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేసే శిక్షణలను రద్దు చేయాల మండల ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గజపతినగరంలో ఉపాధ్యాయుడి మృతికి గురువారం స్థానిక విద్యావనరుల కార్యాలయం వద్ద సంతాపం తెలిపారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధికి చిరునామా చంద్రబాబు



టీడీపీలో చేరిన వారితో బంగార్రాజు, నాగార్జున తదితరులు

డెంకాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి చిరునామా సీఎం చంద్రబాబు నాయుడు అని.. ఆయనను చూసి పార్టీలోకి వస్తున్నారని మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. గురువారం ఆకులపేట సర్పంచ్ సువ్వాడ రమేష్, వార్డు సభ్యులు, అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, మాజీ జెడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ సమక్షంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మొత్తం 40 కుటుంబాలు టీడీపీలో చేరినటు మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణిరాజు, పిఏసీఎస్ మాజీ అధ్యక్షులు ప్రదీప్ రాజు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పతివాడ శివరామ విద్యాసాగర్‌నాయుడు, సత్యనారాయణ రెడ్డి, పిన్నింటి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పనితీరు భేష్: డీఐజీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ, ఎస్పీ

గరివిడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో పోలీసుల పనితీరు బాగుందని విశాఖపట్టణం డీఐజీ గోపీనాథ్ జట్టి కితాబిచ్చారు. గరివిడి డీఎస్పీ కార్యాలయాన్ని, మెరకముడిదాం మండలంలోని బుదరాయవలస పోలీసు స్టేషన్‌ను ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. పోలీసు వ్యవస్థ మొత్తం సైబర్ నేరాలు, గంజాయి నిరోధంపై దృష్టి సారించిందన్నారు. గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బస్సు ఢీకొని యువకుడి మృతి

ఆమదాలవలస, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి తిమ్మాపురం సమీపంలో గల జంక్షన్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మన్యం జిల్లా వీరఘట్టం మండలం జె.గోపాలపురం గ్రామానికి చెందిన ఊయక చంద్రశేఖర్(30) అదే గ్రామానికి చెందిన కూర్మినాయుడుతో బైక్‌పై శ్రీకాకుళం వస్తుండగా.. తిమ్మాపురం సమీపంలోని జంక్షన్‌కు వచ్చేసరికి పాలకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. ఈ ఘటనలో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ డ్రైవ్ చేస్తున్న కూర్మినాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఇతడిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. సమచారం అందుకున్న ఎస్ఐ వెంకటేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

లక్కవరపుకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మార్లాపల్లి గ్రామానికి చెందిన సమ్మంగి మహాలక్ష్మి (63) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఏఎస్ఐ టి. శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలు మార్లాపల్లి గ్రామంలో ఒంటరిగా జీవనం సాగిస్తోందని, బుధవారం రాత్రి వంట చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ నిప్పంటుకొని గాయపడిందని తెలిపారు. ఆమెను 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మరణించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

సారా తయారీ కేంద్రాలపై దాడి



స్వాధీనం చేసుకున్న సామగ్రితో సిబ్బంది

విజయనగరం క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలోని గుమలక్ష్మీపురం మండలం కన్నయ్యగూడ గ్రామ శివార్లలో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడి చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ధ్వంసం చేశారు. ఎస్‌కే పాడు కాలనీ పరిధిలో 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐ రాజేశ్వరి, ప్రొహిబిషన్ ఎక్సైజ్ కురుపాం, పార్వతీపురం ఎస్ఐలు రాజశేఖర్, నాగేశ్వరరావు, హెచ్‌సీలు నాగేశ్వరరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

నెల్లిమర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తంగుడుబిల్లిలో బెల్ట్ షాపు నడుపుతున్న ఓ వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. ఆయన వద్ద నుంచి 79 మద్యం సీసాలను, మోటారు వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు వివరించారు. బెల్ట్‌షాపులపై సమాచారం తెలిసిన వ్యక్తులు 9121109444 నంబరుకు తెలపాలని ఆయన సూచించారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు



మద్యంషాపులను తనిఖీ చేస్తున్న ఏసీ రామచంద్రరావు

గజపతినగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం షాపుల్లో అధిక ధరలకు అమ్మకాలు చేపట్టినా, బెల్టుకు షాపు యజమానులు సహకరించినా కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం గజపతినగరంలో మద్యం షాపులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ జనార్దనరావు, ఎస్ఐ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల బెడదపై దృష్టి పెట్టండి



పవన్‌తో చర్చిస్తున్న కలిశెట్టి

విజయనగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో ఏనుగులతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో పవన్‌ను కలిసి సమస్యను వివరించారు. ఏనుగుల దాడులకు భయపడి ప్రజలు ఇళ్లు వదిలి వెళ్లిపోవలసి వస్తోందని వివరించారు. ఇదిలా ఉండగా నెల్లిమర్ల జంక్షన్ నుంచి రణస్థలం రహదారి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ కలిశెట్టి కోరారు. రామభద్రపురం నుంచి రాయగడ వరకూ రహదారి అభివృద్ధికి సహకరించాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

దత్తిరాజేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వి.కృష్ణాపురం ఫీల్డ్ అసిస్టెంట్ యాగాటి లక్ష్మీపై గురువారం ఎంపీడీవో వైవీ రాజేంద్రప్రసాద్ విచారణ చేపట్టారు. అదే గ్రామానికి చెందిన యాగాటి శంకరరావు లోకాయుక్తలో చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేపట్టినట్టు తెలిపారు. 2020-21 సంబంధించిన ఉపాధి పనుల్లో ప్రభుత్వం నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగం మేరకు ఈ విచారణ చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో వైవి.రాజేంద్రప్రసాద్ వేతనదారులతో మాట్లాడి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

జగనన్న లేఅవుట్లు పరిశీలన

లక్కవరపుకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జామి, ఎల్.కోట, కొత్తవలస మండలాల్లో ఉన్న జగనన్న లేఅవుట్‌లను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.కామేశ్వరరావు గురువారం పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ వేసిన లేఅవుట్‌లలో అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో లేఅవుట్లు పరిశీలించామన్నారు. జామి మండలంలో 11, కొత్తవలసలో 26, ఎల్.కోటలో 18 లేఅవుట్‌లను పరిశీలించినట్లుగా ఆయన తెలిపారు. వీటిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలియజేశారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరావు ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచండి

జామి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సామర్థ్యం పెంచే బాధ్యత ఉపాధ్యాయులదని మండల విద్యాశాఖాధికారి-2 గంగరాజు అన్నారు. గురువారం మండలంలోని నారాయణపురం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు.

సహకార బ్యాంకుల్లో అవకతవకలకు చోటివ్వద్దు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకులో అవకతవకలకు తావులేని విధంగా నియంత్రణ ఉండాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశించారు. డీసీసీబీ సర్వ సభ్య సమావేశం బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధ్యక్షతన గురువారం వర్చువల్‌గా నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల కమిటీ సభ్యులు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

భోగాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భోగాపురం మండల యూటీఎఫ్ అధ్యక్షులుగా పడాల చంద్రశేఖరరావు ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా పి.నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా పి.ప్రకాశరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా టిపద్మ, పి.వాసుదేవరావు, ట్రెజరర్‌గా కె.శ్రీనివాసబెహరా, కన్వీనర్‌గా కె.శ్రీనివాసరావును ఎన్నుకున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గజపతినగరం నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సీఐ జీఏవీ రమణ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, సైబర్ నేరాలకు పాల్పడితే శిక్షలు తప్పవన్నారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపేస్తాం

రాజాం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పనుల్లో నాన్యత లోపిస్తే బిల్లులు నిలుపదల చేస్తామని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం అంతికాపల్లి గ్రామంలో సిమ్మెంట్ రోడ్డు, కాలువ నిర్మాణం పనులను పరిశీలించారు. దగ్గరుండి చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి

నెల్లిమర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ పారిశుధ్య విభాగంలో పనిచేస్తూ మృతి చెందిన తుపాకుల రమణమ్మ, బొమ్మాలి వెంకట్ కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగం ఇవ్వాలని, ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిషనర్ కె.అప్పలరాజుకు గురువారం వినతిపత్రం సమర్పించారు.

రామతీర్థం జంక్షన్‌లో సీసీ కెమెరాలు

స్థానిక రామతీర్థం జంక్షన్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ గురువారం తెలిపారు. ప్రతి గ్రామంలోనూ సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానిక పెద్దలు, ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలని ఆయన సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిన్నారుల ఆటలను తిలకిస్తున్న జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రాణి

సీతానగరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ రాణి గురువారం సందర్శించారు. కేంద్రంలో విద్యార్థుల హాజరు, కేంద్రానికి సంబంధించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. మండలంలో ఈ కేంద్రం మోడల్‌గా ఉండడంతో మిగిలిన కేంద్రాలను కూడా ఇదే తరహాలో తీర్చిదిద్దనున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అందజేస్తున్న పౌష్టికాహారం, తదితర వాటిని సకాలంలో అందజేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లా నోడల్ అధికారి ఎన్.రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.శైలజ, ఎం.సునీత, ఎ.లక్ష్మి, హెల్పర్ జ్యోతి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

కురుపాం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై కురుపాం వారపు సంతలో కురుపాం ఎస్ఐ నారాయణరావు ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన కలిగించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ నారాయణరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో మీ జీవితాలను బలి చేసుకోవద్దన్నారు. ఎన్‌డీపీఎస్, సైబర్ నేరాలు, అత్యవస పరిస్థితుల్లో స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, సంతలలో జరుగుతున్న మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు

మక్కువ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెంకటభైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్పం కార్య క్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. చట్టాలపై విద్యార్థులకు అవగాహ కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై అవగాహన

పాలకొండ, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1,2 ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌తో పాటు పాలకొండ రెవెన్యూ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు విధిగా చేసుకోవాలన్నారు. స్థానిక ఉప తహసీల్దార్ డి.శేఖర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో స్వీప్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు, ఎస్.శంకర్‌బాబు, ఈఎల్‌సీ మెంబర్ జి.జమ్మయ్య అధ్యాపకులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి

సీతంపేట రూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం మన్మథరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రధానగేటు ఎదురుగా ఉద్యోగులు చేస్తున్న శాంతియుత నిరసన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఉద్యోగులకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. శిబిరంలో ఏజేఏసీ నాయకులు రామ్మోహనరావు, ఉద్యోగులు బి.గణేష్, మోహనరావు తదితరులున్నారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

గరుగుబిల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గరుగుబిల్లి సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బాల్య వివాహాలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయా వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పుడో బాల్యవివాహాలను నిషేధించిందన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రభుత్వం బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని రూపొందించిందన్నారు. బాల్య వివాహాల నిషేధంపై అంగన్‌వాడీ వర్కర్లు మానవహారం నిర్వహించడంతో పాటు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

బెలగాం, నవంబరు28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని అప్ హోల్డ్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ రాజశేఖర్ పిలుపునిచ్చారు. బాల వివాహ్ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ శ్యాంప్రసాద్ సహకారంతో జిల్లాలో గత కొన్ని రోజులుగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని, బాల్య వివాహాల రహిత జిల్లాగా రూపొందడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని రాజశేఖర్ కోరారు. దేశ వ్యాప్తంగా బాలల హక్కుల రక్షణ కోసం పనిచేస్తున్న 250 ఎన్జీవోలలో అప్ హోల్డ్ సంస్థ ఒకటని తెలిపారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

బలిజిపేట, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధించాలని బలిజిపేట మండల విద్యాశాఖాధికారి-1 సామల సింహాచలం అన్నారు. గురువారం చిలకలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇంకా మూడు నెలలు మాత్రమే ఉందని, ఇప్పటినుంచే కష్టపడి చదవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రగతి సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్య క్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూలేకు నివాళి

పాలకొండ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతీబాపూలే వర్ధంతి సందర్భంగా వైసీపీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం స్వగృహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలను గురువారం వేసి నివాళులు అర్పించారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్ పూలే చి త్రపటానికి పూలమాలలు వేశారు. వైసీపీ నాయకులు వెలమల మన్మథరావు, కనపాక సూర్యప్రకాష్, దుప్పాడ పాపినాయుడు, కడగల వెంకటరమణ, బాబీ, ఎద్దు లిల్లీ పుష్పనాథం, చిన్ని, మరియదాసు, పైల వాసు పాల్గొన్నారు.

సాలూరు రూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే 134 వర్ధంతి వేడుకలను సామాజిక కార్యకర్త కోడూరు సాయి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం సాలూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే సేవలను ఆయన కొనియాడారు.

ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్లు సహకరించాలి

బొబ్బిలి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామంలో గల సంతోషిమాత రైస్ మిల్లు, కింతలివానిపేటలో గల కేవీఆర్ వెంకటరమణ రైస్ మిల్లులను గురువారం ఆర్డీవో రామమోహనరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు మిల్లర్లకు పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వచ్చిన ధాన్యం ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో పరిశీలించి తర్వాత కోత విధించకుండా దిగుమతి చేసుకోవాలన్నారు. ఈ విషయంలో మిల్లర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం దిబ్బగుడ్డివలస రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో తనిఖీ చేశారు. కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ స్థానికంగా నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేయాలని మండల వ్యవసాయాధికారులకు ఆదేశించారు. రైతు సేవాకేంద్రం నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు.



మిల్లర్లకు సూచనలిస్తున్న ఆర్డీవో రామమోహన్‌రావు

సద్వినియోగం చేసుకోవాలి

మక్కువ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్‌నాయుడు అన్నారు. మండలంలోని మార్కొండపుట్టి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు న్యాయం చేకూరే విధంగా వెలుగు, వ్యవసాయశాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ఏవో శ్రీనివాసరావు, బొంగు వాసుదేవరావు, చొక్కాపు బుచ్చినాయుడు, కూటమి నాయకులున్నారు.

సేవలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న పద్మావతి

గరుగుబిల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కేవీఎస్ పద్మావతి హెచ్చరించారు. గురువారం మండలంలోని రావుపల్లి సచివాలయంలోని హెల్త్ వెల్‌నెస్ కేం ద్రంతో పాటు గరుగుబిల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణు లు, బాలింతలకు మెరుగైన సేవలందించాలన్నారు. వసతి గృహం విద్యార్థినుల ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రసవాలు జరిగేలా దృష్టి సారించాలన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండాల న్నారు. రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే క్షమించేది లేదన్నారు. వైద్యాధికారులు డాక్టర్ కేకే సాగర్‌వర్మ, డాక్టర్ సంతోష్‌కుమార్, సిబ్బంది రమణమ్మ, ఉదయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అంబులం పూజ



సీతానగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణరాయపురం గ్రామంలో కార్తీకమాసంలో మహా అన్నదానం కార్యక్రమంతో పాటు గ్రామ పురోహితులు రాంబాబు, గురుస్వామి వెంకటరమణ ఆధ్వర్యంలో అయ్యప్ప పాలాభిషేకం పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అన్నంనాయుడు ఆధ్వర్యంలో 2,500 మందికి అన్నదాన ఏర్పాట్లు చేశారు. పెదంకలాం, మురగడం, అప్పయ్యపేట గ్రామాల అయ్యప్ప భక్తులు, సుమారు 200 మంది స్వాములు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటాలి



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పీవో యశ్వంత్

సీతంపేట రూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన గిరిజన విద్యార్థులను గురువారం ఆయన అభినందించారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. విశాఖపట్నంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పీవో, ఏపీవో చిన్నబాబు ప్రత్యేకంగా అభినందించారు. పీవోను కలిసిన వారిలో పాఠశాలల హెచ్ఎంలు, వార్డెన్‌లు ఉన్నారు.

గుంతలు పూడ్చాలి

పార్వతీపురంటౌన్, నవంబరు 28: మన్యం జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్‌తో పాటు ప్రధాన రహదారిలో గుంతలను పూడ్చాలని పట్టణ సీపీఎం కార్యదర్శి జీవీరమణ డిమాండ్ చేశారు. గురువారం గుంతలను పూడ్చాలని కోరుతూ ఫ్లైఓవర్‌పై సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్‌తో పాటు బైపాస్ రహదారిలోని సాయిబాబా ఆలయం నుంచి పెట్రోల్ బంకు వరకు, పాలకొండ రోడ్ హనుమాన్ కూడలి నుంచి పాతబస్టాండ్, రాయగడ రోడ్డు శివారు వరకు రహదారిలో భారీ గుంతల వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మంచి విత్తనం ఎంచుకోవాలి



మాట్లాడుతున్న డీఎం దినేష్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మన విత్తనం.. మంచి విత్తనమని నాబార్డు డీఎం దినేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చాపరాయిగూడ, బిన్నిడి పంచాయతీ పరిధిలోని బాగుడబ గ్రామంలో నాబార్డు ఆర్థికసాయంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా మాతోట రైతులకు విత్తనం ఎంపిక, సస్యరక్షణ, పంట కోసిన తర్వాత చేయాల్సిన యాజమాన్య పద్ధతులపై ఒక రోజు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పెట్టుబడి తగ్గి దిగుబడులు పెరగడానికి ముందుగా చేయాల్సిన అంశమే విత్తన ఎంపిక అన్నారు. విత్తనం మంచిదైతే పైరు ఏపుగా పెరిగి దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. జిల్లా డీపీఎం షన్ముఖరాజు, జట్టు ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, జీవ మాతోట కమిటీ అధ్యక్షుడు తాడంగి జమ్మయ్య, సభ్యులు గీత, పి.లక్ష్మీ, మాజీ సర్పంచ్ జ్యోతి, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.ప్రబోధ్, 12 గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గిరిజన బాలిక



లక్షహిత

సీతంపేట రూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు సీతంపేట బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న హెచ్ లక్షహిత ఎంపికైంది. జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. నేడు (శుక్రవారం) కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో జరిగే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో లక్షహిత తన ప్రతిభను మరోసారి చూపనుంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో జి.చిన్నబాబు అభినందించారు.

ఘనసరలో అష్టలక్ష్మీయాగం



అష్టలక్ష్మీయాగం చేస్తున్న దృశ్యం

భామిని, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘనసర మదన కామేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు జరిగిన అష్టలక్ష్మీ యాగం గురువారంతో ముగిసింది. వేద పండితులు గుడిమెట్ల శ్రీనివాస్‌శర్మ, రంప లలిత ప్రసాద శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో విశేష పూజలు చేశారు. హోమంలో దంపతులు పాల్గొనగా చుట్టుపక్కల గ్రామస్థులు కీసర, కోసలి, పెద్దదిమిలి, కొరమ, బాలేరు తదితర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

పాలకొండ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ పరిధిలో మెయిన్‌రోడ్డులో పాత ఆంధ్రాబ్యాంకు ఎదురుగా ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాలకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పడాల భూదేవి ఆదేశాల మేరకు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. టీడీపీ నాయకులు గుమ్మడి సింహాద్రి ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుమ్మెద వెంకటరమణ, తమ్మినాయుడు, గొర్రెల వెంకటేష్, దుప్పాడ మన్మథ, దుప్పాడ వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు

సాలూరు రూరల్: మామిడిపల్లిలో నేత్ర ఉచిత పరీక్షలను గురువారం నిర్వహించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ మీసాల ఉమామహేశ్వరరావు పరీక్షలనంతరం మందులందించారు.

1 నుంచి రెండు పూటలా కళాశాల

బెలగాం, నవంబరు28(ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిసెంబరు 1 నుంచి రెండు పూటలూ కళాశాల ఉంటుందని వృత్తి విద్యాధికారిణి డి.మంజులవీణ తెలిపారు. జిల్లాలో షిఫ్ట్ పద్ధతిలో నడుస్తున్న కళాశాల వీరఘట్టం కళాశాల అని, పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతులు, ప్రత్యేక తర్ఫీదు ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాల ఉంటుందని, విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

నేడు ఉపకరణాల గుర్తింపు శిబిరం

కురుపాం, నవంబరు28(ఆంధ్రజ్యోతి): నేడు కురుపాంలో వికలాంగులు, వయో వృద్ధులకు ఉపకరణాల గుర్తింపు జరుగుతుందని కురుపాం ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కురుపాం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో హైదరాబాద్ అలిమ్ కో సంస్థ, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ సహకారంతో యస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉపకరణాల గుర్తింపు జరుగుతుందన్నారు. వీల్ చైర్లు, చేతి కర్రలు, అంధులకు స్మార్ట్ కేన్/ చేతికర్ర, ట్రైయిలీ కిట్, స్మార్ట్ ఫోన్, బధిరుల(మూగ/ చెవుడు)కు శ్రవణ యంత్రాలు అందించేందుకు ఈ ఎంపిక శిబిరం నిర్వహిస్తున్నరన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

సీతానగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.రాజేష్ అన్నారు. గురువారం సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సీతానగరం బజార్‌లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు తెలియని వ్యక్తుల నుంచి లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లంక శ్రీను, కానిస్టేబుళ్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి

మక్కువ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంబర పోలమాంబ ఆలయ పరిసరాలు చుట్టూ నిర్మిస్తున్న రహదారి పనుల్లో నాణ్యత పాటించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు అన్నారు. గురువారం రహదారి పనులను పరిశీలించారు. రెండు కోట్ల40 లక్షల నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యతాలోపం ఉందన్నారు. రోడ్లు, కాలువలు, రిటర్నింగ్ వాల్ నిర్మాణంపై ఆరోపణలు ఉన్నాయన్నారు. రహదారి మధ్యలో విద్యుత్ స్తంభం తొలగించాలన్నారు. రహదారి నిర్మాణంలో నాణ్యత పాటించాలని, లేకుంటే ఆందోళన తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆదినారాయణ ఉన్నారు.

మండల కేంద్రాల్లోనే శిక్షణ నిర్వహించాలి

గరుగుబిల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను మండల స్థాయిలో గాని, డివిజనల్ స్థాయిలో గాని నిర్వహించాలని యూటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం వీరు మాట్లాడుతూ శిక్షణా కేంద్రం పరిధిలో సరైన సదుపాయాలు, సౌకర్యాలు లేవన్నారు. గజపతినగరం సమీపంలోని మరుపల్లి బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో శిక్షణ పొందుతూ భామిని మండలం నేరేడు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్.శ్రీనివాసరావు గుండె పోటుతో మరణించారన్నారు. సౌకర్యాలు, ఆసుపత్రి అందుబాటులో లేకపోవడంతోనే శ్రీనివాసరావు మృతి చెందారన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో శిక్షణలు నిర్వహించాలన్నారు.

అక్రమ సస్పెన్షలు, బదిలీలను రద్దు చేయాలి

పార్వతీపురంటౌన్, నవంబరు 28: జిల్లా, రాష్ట్రస్థాయిలో 1/2019 సర్క్యులర్‌కు విరుద్ధంగా ఏపీఎస్ఆర్టీసీ అధికారులు చేసిన అక్రమ సస్పెన్స్‌లు, బదిలీలను రద్దు చేయాలని ఆర్టీసీ పార్వతీపురం డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఏఎస్‌టీ బాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డిపో గేటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ కారణం చేతైనా బస్ గంట ఆలస్యమైయితే ఆమేరకు ఆ సర్వీసు రద్దు చేయాలన్నారు. డిపోలో ఓడీలను రద్దు చేయాలని, సస్పెండ్ చేసి ఇతర డిపోలకు బదిలీ చేసిన ఉద్యోగులను తిరిగి పార్వతీపురం డిపోకు రప్పించాలన్నారు. సంస్థలో ఉద్యోగ, కార్మికులకు ఒత్తిడి తగ్గించాలంటే వెంటనే ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ జోనల్ కార్యదర్శి ఎం.సీహెచ్ అప్పడు, జోనల్ అధ్యక్షులు వి. రాములు, డిపో కమిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

సాలూరు, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులందరికీ కార్మిక చట్టాలు అమలు చేయాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.తులసిరామ్, జిల్లా నాయకులు వి.చంద్రయ్య డిమాండ్ చేశారు. పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం స్థానిక విలేఖర్లతో కలసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఆర్టీసీ కార్మిక చట్టాలు అమలు చేసి జీతాలు, అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తమ న్యాయపరమైన డిమాండ్‌లు పరిష్కరించేంత వరకు పోరాడేందుకు వెనుకాడమని తెలిపారు. పలువురు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

శిక్షణ రద్దు చేయాలంటూ పలు చోట్ల నిరసన

పాలకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మృతి వార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పార్వతీపురం డీఈవో ఎన్.తిరుపతినాయుడు సంతాపం తెలిపారు. ఎమ్మెల్సీ రఘువర్మ శ్రీనివాసరావు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పట్టణ, మండల అధ్యక్షుడు గంటా సంతోష్, గండి రామినాయుడు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు. ● ఉపాధ్యాయులు మరణానికి కారణమైన రెసిడన్షియల్ ట్రైనింగ్‌లు రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

● సాలూరు రూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా గజపతినగరం బాలాజీ పాలిటెక్నిక్‌లో జరుగుతున్న లీడర్ షిప్ శిక్షణ కార్యక్రమంలో గురువారం భామిని మండల ఉపాధ్యాయుడు సిరిపురపు శ్రీనివాసరావు ఆకస్మిక మృతి పట్ల ఉపాధ్యాయులు భగ్గుమన్నారు. రెసిడెన్షియల్ శిక్షణలొద్దని మొరపెట్టుకున్న ప్రభుత్వం మొండిగా నిర్వహిస్తుండడం పట్ల ఆపస్,యూటీఎఫ్,ఏపీటీఎఫ్ తదితర సంఘాలు భగ్గుమన్నాయి. శిక్షణలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న పాచిపెంట మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు చంద్రశేఖరుని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంచాడవలసలో లంచ్ విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేశారు.

● ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేసి మండల స్థాయిలో నిర్వ హించాలని యూటీఎఫ్ పార్వతీపురం జిల్లా సహ అధ్యక్షుడు బోడెల విజ యకుమార్ డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులను వివిధ కారణాలతో వేధించడం తగదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు జాగాన రామునాయుడు అన్నారు. సుదూర ప్రాంతాల్లో రెసిడెన్షియల్ శిక్షణనివ్వడమే తార్కాణమన్నారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మృతదేహానికి పాలకొండలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ నివాళులర్పించారు.